వ్యర్థాలు వదిలేస్తున్నారు!

- కలుషితంగా గోదావరి జలాలు
- అరికట్టాలని ప్రజల మొర

సామర్లకోట: వ్యర్థాలు వదిలేస్తున్నారు.. గోదావరి జలాలను కలుషితంగా మార్చుతున్నారు.. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని దూరం చేస్తూ ఆరోగ్యంతో ఆటలాడుతున్నారు.. గోదావరి కాలువలో వివిధ గ్రామాల నుంచి కలుషిత జలాలు విచ్చలవిడిగా విడిచి పెడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకూ ఉన్న గోదావరి కాలువను సామర్లకోట గోదావరి కాలువ అని పిలుస్తారు. గోదావరి కాలువ వెంబడి సామర్లకోట, రూరల్‌కు చెందిన గ్రామాలు ఉండటమే కారణంగా చెప్పవచ్చు. పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలతో పాటు కాకినాడ కార్పొరేషన్‌కు చెందిన ప్రజలు ఈ నీటిని తాగునీరుగా ఉపయోగిస్తున్నారు. అయితే ఈ కాలువలో కాలుష్య జలాలు విచ్చలవిడిగా కలుస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడంతో విఫలం అవుతున్నారు.

చర్చించి.. వదిలేసి..

స్థానిక పంచారామ క్షేత్రంలో జరిగే ఉత్సవాల సమయంలో గోదావరి కాలువలో కాలుష్య జలాలపై చర్చ జరగడం, తరువాత మౌనంగా ఉండడం జరుగుతూనే ఉంది. ఇందులో భాగంగానే కార్తీక మాసం ఉత్సవాల్లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గోదావరి కాలువలో కాలుష్య జలాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. అయినా నేటికీ ఫలితం శూన్యం. మహా శివరాత్రిని పురస్కరించుకుని గోదావరి కాలువలో, ఆలయ పుష్కరణిలో భక్తులు స్నానాలు చేస్తారు. గోదావరి కాలువలో నీటిని పుష్కరిణిలో నింపుతారు. జి.మేడపాడు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం గ్రామాల్లో ప్రజల వాడకం నీరు, మురుగునీరు ప్రధాన డ్రైన్ల ద్వారా గోదావరి కాలువలోకి విడిచి పెడుతున్నారు. మహాశివరాత్రి ఏర్పాట్లపై అధికారులతో జరిగిన సమావేశంలో కాలుష్య జలాలకు అడ్డుకట్ట వేయాలని భక్తులు కోరడం, అధికారులు సమావేశంలో నివారిస్తామని హామీ ఇచ్చి చేతులు దులుపుకోవడం జరుగుతోంది. శివరాత్రి 10 రోజుల ముందుగానే కాలుష్య నీరు రాకుండా అడ్డుకట్ట వేయాలని భక్తులు కోరుతున్నారు.



వేట్లపాలెం నుంచి గోదావరి కాలువలోకి వస్తున్న మురుగునీరు



వేట్లపాలెం గ్రామం నుంచి వస్తున్న మురుగునీరు


కాలుష్యాన్ని నివారించాలి



మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అనేక ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు గోదావరి కాలువ, ఆలయ పుష్కరణిలో స్నానాలు చేస్తారు. ఆ సమయంలో గోదావరి కాలువలో కలుషిత జలాలు కలిస్తే భక్తులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని శివరాత్రికి 10 రోజుల ముందు నుంచి కాలుష్య జలాలను నివారించాలి.

–నూతలపాటి అప్పలకొండ, జిల్లా మానవ హక్కుల సంఘ అధ్యక్షుడు, సామర్లకోట

కలెక్టర్ దృష్టికి తీసుకు వెళతాం..



వివిధ గ్రామాలు, పరిశ్రమల నుంచి కాలుష్య జలాలు గోదావరి కాలువలో కలుస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. గోదావరి కాలువ నీటినే ఆలయ పుష్కరణిలో నింపుతున్నారు. కాలుష్య జలాలు గోదావరి కాలువలో కలవకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తాం.

–భోళ్ల నీలకంఠం, పంచారామ క్షేత్ర ఈఓ, సామర్లకోట

క్లుప్తంగా

గడియార స్తంభం పనుల పరిశీలన



సామర్లకోటలో గడియార స్తంభం పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో గడియార స్తంభం పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య పరిశీలించారు. ఈ పనులను ఐదు నెలల కిందట ప్రారంభించారు. సోమవారం ఢిల్లీ నుంచి గడియారాలు రావడంతో వాటిని ఏర్పాటు చేయడానికి పనులు చేపట్టారు. వీటిని ఆమె పరిశీలించి, గడియార స్తంభం ముఖద్వారం వద్ద ఐ లవ్ సామర్లకోట అని ఇంగ్లిషు, హిందీలలో ఏర్పాటు చేయాలని, దానికి సంబంధించిన నమూనాను అందజేస్తామని కమిషనర్ కాంట్రాక్టర్‌కు తెలిపారు.

ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ జామ్



సామర్లకోట ఫ్లైఓవర్‌పై నిలిచిపోయిన వాహనాలు

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై సాంకేతిక లోపంతో సోమవారం లారీ నిలిచిపోయింది. దాంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఉదయం ఆయా కళాశాలకు వెళ్లే బస్సులతో ఫ్లైఓవర్ రద్దీగా ఉన్న సమయంలో లారీ నిలిచిపోవడంతో ట్రాఫిక్ పోలీసులు పరుగులు తీసి క్రేన్ తీసుకు రావడానికి వెళ్లారు. స్థానికులు బ్రిడ్జిపై నిలిచిపోయిన లారీని స్టేషన్ సెంటర్‌లోని పెట్రోలు బంకు వద్దకు తోసుకు పోవడంతో ట్రాఫిక్ సమస్యకు మోక్షం లభించింది. దాంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అదే సమయంలో జిల్లా ఎస్పీ సామర్లకోట పంచారామ క్షేత్రానికి రావడంతో ట్రాఫిక్‌లో ఆయన వాహనం ఎక్కడ ట్రాఫిక్‌లో చిక్కుకుంటుందోనని పోలీసులు పరుగులు తీశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నామని పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు అన్నారు. గ్రీవెన్స్‌లో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఏడు అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు సూచించామన్నారు. కార్యక్రమంలో కార్యాలయ డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ అధికారులు రవిశంకర్, దయాదనందరాజు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరం



కుతుకుడుమిల్లిలో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్తపల్లి: మండలంలోని కుతుకుడుమిల్లి, శ్రీరాంపురంలో సోమవారం కొత్తపల్లి పశు వైద్యాధికారి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 200 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందించామన్నారు. పశువుల్లో ఎదకు రాని, చూడి కట్టని, గర్భకోస వ్యాధులకు పశు వైద్యులతో పరీక్షలు చేయించామన్నారు. మంగళవారం కొండెవరం, పొన్నాడ, 29న కొమరగిరిలో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యంతో ప్రజారోగ్యం

కొత్తపల్లి: మండలంలోని గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యంపై దృష్టి పెట్టి, ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బిళ్లకుర్తి రామేశ్వర్‌రెడ్డి అన్నారు. దీనిపై ఎంపీడీఓ రవికుమార్‌కు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో డ్రైనేజీలు పూడికతో నిండిపోవడంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు పెరిగిపోయారని రామేశ్వర్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా చెత్త కుప్పలు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వాసంశెట్టి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు శేషు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలు దారుణం



గొల్లప్రోలులో ఆందోళన వ్యక్తం చేస్తున్న మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు

పిఠాపురం: భారత రాజ్యాంగ దినోత్సవం రోజున పిఠాపురం నియోజకవర్గంలో విచ్చలవిడిగా ఎమ్మార్పీ రేటుకు మించి మద్యం అమ్మకాలు జరిపారని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ ఎస్.సూర్యనారాయణ అన్నారు. సోమవారం జన విజ్ఞాన వేదిక మద్యం, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో గొల్లప్రోలు ఎస్సీ పేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మద్యపాన వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు వేమగిరి తరుణ్, ఎస్.సూర్యనారాయణ మాట్లాడారు. ప్రభుత్వాలు మద్యాన్ని ఆదాయ వనరుగా చూడొద్దని, మద్యం కారణంగా అనేక కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయని అన్నారు. దేశంలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో 70 శాతం మద్యం తాగి వాహనాలను నడపడం వల్లే జరుగుతున్నాయన్నారు. ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సంపూర్ణ మద్యపాన నిషేధం వైపు ప్రభుత్వాలు ఆలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో మద్యం, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు గుర్రాల ప్రసాద్, కరణం విశ్వనాథం, వేమగిరి రాజేంద్ర కుమార్, కె.సింహాచలం, సాల్మన్‌రాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్ధూ, లోవరాజు, వడ్డీకాసులు, జనవిజ్ఞాన వేదిక గొల్లప్రోలు మండల అధ్యక్షుడు ఏలేటి నానిబాబు పాల్గొన్నారు.

ఐక్యతతో సమస్యల పరిష్కారం

పెద్దాపురం: కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని పెద్దాపురం సహాయ కార్మిక శాఖాధికారి రవికుమార్ అన్నారు. పెద్దాపురం పట్టణ ఎలక్ట్రికల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ దినోత్సవాన్ని నిర్వహించారు. వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనం వద్ద నీలం శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు చింతల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ కార్మిక పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చింతల సత్యనారాయణ మాట్లాడుతూ ఐక్యంగా కార్మికులు సాగాలన్నారు. అనంతరం యాసలపు సూర్యారావు భవనం నుంచి మున్సిపల్ సెంటర్ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్, గడిగట్ల సత్తిబాబు, నీలపాల సూరిబాబు, సంఘ సభ్యులు తాడిశెట్టి గంగ, కరణం అప్పారావు, పెదిరెడ్ల విష్ణు, భూసారి శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే

సామర్లకోట: పట్టణంలో ఎలక్ట్రీషియన్స్ డేను సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక సంగీతరావు పేటలోని కమ్యూనిటీ హాల్‌లో మండల ఎలక్ట్రికల్ ప్రైవేట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విద్యుత్తు బల్బును కనిపెట్టిన సర్ థామస్ అల్వా ఎడిషన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పట్టణ పుర వీధుల నుంచి ర్యాలీ చేపట్టారు. 1880 జనవరి 27న సర్ థామస్ అల్వా ఎడిషన్ విద్యుత్తు బల్బును కనిపెట్టారని, అందువల్ల ఏటా అదేరోజున ఎలక్ట్రీషియన్ దినోత్సవాన్ని జరుపుకొంటున్నామని యూనియన్ అధ్యక్షుడు వినకొండ శ్రీనివాసు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పాలకుర్తి దొరబాబు, కార్యదర్శి బత్తుల బాబూరావు, సహాయ కార్యదర్శి కొప్పన శ్రీనివాసు, కోశాధికారి లంకా దాసు తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో ఎలక్ట్రికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ



పెద్దాపురంలో మాట్లాడుతున్న సహాయ కార్మిక శాఖాధికారి రవికుమార్

ముగిసిన రాష్ట్ర స్థాయి నాటక కళా పరిషత్ పోటీలు



స్వేచ్ఛ నాటిక కళాకారులకు ప్రథమ బహుమతి అందిస్తున్న నిర్వాహకులు



స్వేచ్ఛ నాటికలో ఓ సన్నివేశం

పెద్దాపురం: పెద్దాపురం మండలం చంద్రమాంపల్లిలో మూడు రోజులుగా స్నేహ ఆర్ట్స్ ఉభయ తెలుగు రాష్ట్రాల షష్టమ నాటక కళా పరిషత్ పోటీల్లో ఉత్తమ నాటికగా ×స్వేచ్ఛ౽ ప్రథమ బహుమతి సాధించింది. స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేశీ రాజా ఆధ్వర్యంలో మొత్తం ఏడు నాటికలను ప్రదర్శించారు. ఈ నాటికల్లో హైదరాబాద్ విశ్వశాంతి క్రియేషన్స్ ప్రదర్శించిన ×స్వేచ్ఛ౽కు ప్రథమ బహుమతి వచ్చింది. రెండో బహుమతిగా హైదరాబాద్ మిత్ర ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఇది రహదారి కాదు, మూడో బహుమతిని గుంటూరు అమరావతి ఆర్ట్స్ వారిచే ×చిగురుమేఘం నాటిక సాధించింది. ఉత్తమ నటుడిగా డాక్టర్ వెంకట్ గోకాడ (స్వేచ్ఛ), ఉత్తమ నటిగా వాగ్దేవి (రాత), ఉత్తమ రచన ఆకురాతి భాస్కర్ (ఇది రహదారి కాదు), ఉత్తమ దర్శకత్వం బీఎస్ రెడ్డి (స్వేచ్ఛ), ఉత్తమ రంగాలంకరణ ఫణి (స్వేచ్ఛ), ఉత్తమ ఆహార్యం పి.కేశవ, ఉత్తమ సంగీతం సురభి నాగరాజులు ఎంపికయ్యారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కె.శాంతారావు, గోగులపాటి సీతారామస్వామి, డి.రాధాకృష్ణ వ్యవహరించారు. స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేశి రాజా, సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్, మాజీ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ, సభ్యులు వెన్నా పండు, నూకలమంతి నానాజీ చేతుల మీదుగా బహుమతీ ప్రదానం జరిగింది. కేదారి నాగు, ఎం.సత్తిబాబు, పాలాని సత్తిబాబు, దేవాడ పాపేశ్వరరావు, కంటిబోయిన ప్రసాద్, జ్యోతుల దొరబాబు, సమ్మెట గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు



వేట్లపాలెంలో ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

సామర్లకోట: వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి ఏడు నుంచి 12వ తేదీ వరకూ కల్యాణోత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు తెలిపారు. 7న స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, కుమార్తెలను చేసి మేళతాళాలతో పెద్ద శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 8న భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గోపూజ, స్వామివారికి 9 రకాల పూలతో 108 మంది దంపతులచే లక్ష పుష్పాలతో పూజ ఉంటుందన్నారు. సాయంత్రం చిన్న శేష వాహన సేవ, రాత్రి స్వామివారి కల్యాణం జరుగుతుందని చెప్పారు. 9న గరుడ వాహనంపై, 10న సింహ వాహనంపై, 11న హనుమద్వాహన వాహనం, 12న గజ వాహనంపై గ్రామోత్సవాలు ఉంటాయని వివరించారు. 10న సదస్యం, 12న చక్రస్నానం, పూర్ణాహుతి, రాత్రి శ్రీపుష్ప యాగోత్సవం ఉంటాయని వివరించారు.

జిల్లా స్థాయి భజన పోటీలు

స్వామివారి కల్యాణ ఉత్సవాలను పురస్కరించుకొని వచ్చే నెల తొమ్మిది నుంచి 11వ తేదీ వరకూ జిల్లా స్థాయి భజన పోటీలు జరుపుతున్నట్లు నిర్వాహకులు చెప్పారు. పురుషులు, స్త్రీలకు విడివిడిగా పోటీలు ఉంటాయన్నారు. ప్రతి బృందంలో 10 మంది సభ్యులు ఉండి అంతా ఒకే గ్రామానికి చెందిన వారై ఉండాలన్నారు. సభ్యులు అంతా ఒకే రకమైన యూనిఫారంతో భజనలో పాల్గొనాలని చెప్పారు. ప్రతి బృందం గోవింద నామాలు విధిగా పాడాలన్నారు. ఒక్కో బృందానికి గంటన్నర నుంచి రెండు గంటల సమయం ఉంటుందని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు తమ బృందాల పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. విజేతలైన స్త్రీ, పురుషులకు విడివిడిగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు.

రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి

పిఠాపురం: దుర్గాడలో ప్రసిద్ధి గాంచిన శివాలయంలో రామలింగేశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పుష్య బహుళ త్రయోదశి, మూలా నక్షత్రం, సోమవారం మాస శివరాత్రి కలసి రావడంతో ప్రత్యేక పూజాదికాలు చేపట్టారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు రామలింగేశ్వరుడికి మహన్యాస పూర్వక ఏకవార, ఏకాదశ ద్రవ్య రుద్రాభిషేకాలు, 11 రకాల అభిషేక ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించి, ఏకాదశ హారతులు సమర్పించారు. ఆలయ సేవా సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇలాగైతే ఎలా!



మఠం సెంటర్‌లో షాపుల వద్ద తొలగించిన కల్వర్టు వ్యర్థాలు, పూడిక

సామర్లకోట: స్థానిక మఠం సెంటర్‌లో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద డ్రైన్‌లో పూడికతీత నిమిత్తం నెల రోజుల కిందట కల్వర్టును కూల్చి వేశారు. డ్రైన్‌లో తీసిన పూడికను షాపుల వద్ద వదిలేయడంతో భరించలేని దుర్వాసన వస్తుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల్లో పూర్తి చేయాల్సిన పనిని నెలల తరబడి కొనసాగిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షాపుల వద్దకు వెళ్లడానికి అవకాశం లేకుండా చేయడంతో అద్దెలు ఏ విధంగా చెల్లించాలని ఆందోళన చెందుతున్నారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్ సముదాయంలోనే స్టేట్ బ్యాంకు ఆఫ్ హైదరాబాద్ (ప్రస్తుత స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా)తో పాటు ఎస్‌బీఐ ఏటీఎం కూడా ఉంది. బ్యాంకుకు, ఏటీఎం వద్దకు వెళ్లడానికి చాలా ఇబ్బందిగా ఉంటుందని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా మున్సిపల్ అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉండి షాపులు, బ్యాంకుల వద్దకు వెళ్లడానికి ప్రయత్నం చేస్తే డ్రైన్‌లో పడిపోయే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా తీసిన పూడికను తొలగించి, శిథిలం చేసిన కల్వర్టు వ్యర్థాలను తొలగిస్తే షాపులకు వెళ్లడానికి కనీసం బల్లలు వేసుకుంటామని వ్యాపారస్తులు తెలియజేస్తున్నారు. దీనిపై అధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూద్దాం.

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట



ఎస్పీ దంపతులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న ఆలయ పండితులు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయంలో తెల్లవారు జాము నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ఈఓ భోళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, పూజలను పిఠాపురం మహారాజా గోత్రనామాలతో నిర్వహించారు. సోమవారం పర్వదినం కావడంతో లక్షపత్రి పూజలు జరిగాయి. ఆలయానికి వచ్చిన భక్తులు ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరణి నుంచి నీళ్లతో స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. ఆలయంలోని పెద్ద నంది, మూలవిరాట్ ఉప ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఉదయం ప్రసాదం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం స్వామి వారిని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

- ఎస్పీగా కొత్తగా బాధ్యతలు స్వీకరించే ముందు స్థానిక బాలా త్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో జి.బిందు మాధవ్ దంపతులు పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఎస్పీ దంపతులకు పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కాలభైరవస్వామి, ఆలయంలోని శివలింగాన్ని, పెద్ద నంది, మూలవిరాట్, ఉప ఆలయాలను ఎస్పీ దంపతులు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. పూజల అనంతరం ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు అంజిబాబులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈఓ భోళ్ల నీలకంఠం ప్రసాదం, స్వామివారి ఫొటోను అందజేశారు. ఆలయ శ్రీచక్ర పండితుడు వేమూరి సోమేశ్వరశర్మ ఆలయ విశిష్టతను, వచ్చే నెల 24 నుంచి ప్రారంభం అయ్యే మహా శివరాత్రి ఉత్సవాల ప్రాధాన్యాన్ని వివరించారు. డీఎస్పీ డి.శ్రీహరిరాజు, సీఐ ఎ.కృష్ణభగవాన్, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఇటీవల జరిగిన బదిలీలో కర్నూల్ నుంచి బిందు మాధవ్ కాకినాడ ఎస్పీగా వచ్చారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా బందోబస్తు



మొండి వద్ద సీఐ, ఎస్సైలతో కలసి స్నానాల రేవును పరిశీలిస్తున్న ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్

కరప: చొల్లంగి అమావాస్య తీర్థంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన బందోబస్తు నిర్వహించాలని కాకినాడ సబ్ డివిజన్ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ ఆదేశించారు. మండలంలోని ఉప్పలంక శివారు మొండి వద్ద ఈ నెల 29న జరిగే చొల్లంగి తీర్థం ఏర్పాట్లను పరిశీలించారు. రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కరప, కోరంగి ఎస్సైలు టి.సునీత, సత్యనారాయణరెడ్డిలతో బందోబస్తు నిర్వహణపై చర్చించి, పలు సూచనలు చేశారు. స్నానాల రేవును పరిశీలించి, భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని, గజ ఈతగాళ్లను అక్కడ ఉంచాలన్నారు. దొంగతనాలు జరగకుండా, ఆకతాయిలు తిరగకుండా చూడాలన్నారు. సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద క్యూలైన్ వద్ద తొక్కిసలాట జరగకుండా, ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. వాహనాల రాకపోకలతో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తగిన పర్యవేక్షణ చేయాలన్నారు. ట్రాఫిక్ మళ్లింపు తదితర అంశాలపై ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ సూచనలిచ్చారు. యానాం వైపు నుంచి వచ్చే వాహనాలను వేమవరం, గొర్రిపూడి, పెనుగుదురు మీదుగా కాకినాడ వెళ్లేందుకు, కాకినాడ వైపు నుంచి యానాం వైపు వెళ్లే వాహనాలు తూరంగి, నడకుదురు, గురజనాపల్లి మీదుగా యానాం రోడ్డుకు వెళ్లేలా మంగళవారం అర్ధరాత్రి నుంచి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్టు సీఐ చైతన్యకృష్ణ వివరించారు. స్నానాల రేవు, ఆలయం వద్ద చేసిన ఏర్పాట్లను ఎంఎస్ఎన్ చారిటీస్ అసిస్టెంట్ కమిషనర్ కె.వి జయలక్ష్మి వివరించారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి



క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే ఐఐఐపీటీ డైరెక్టర్ కృష్ణ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే కళాశాలతో పాటు అనుబంధ కళాశాల విద్యార్థులకు పట్టాతోపాటు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు ఐఐఐపీటీ డైరెక్టర్ బత్తుల తిరుమల కృష్ణ అన్నారు. స్థానిక జేఎన్‌టీయూలో సోమవారం వర్సిటీ ప్లేస్‌మెంట్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలలో అభ్యర్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిటోరియంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకుని పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రతి నెలా 2 నుంచి మూడు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించేలా కంపెనీ ప్రతినిధులతో సంప్రదిస్తున్నామన్నారు. ఈ ఇంటర్వ్యూలకు 120 మంది హాజరుకాగా మెకానికల్ ఏడుగురు, కెమికల్ పది, కెమిస్ట్రీ 9 మంది, హెల్త్‌సేఫ్టీ ఒకరిని ఎంపిక చేశారు.

ఆకట్టుకున్న సంగీత కచేరి

బోట్‌క్లబ్: సంగీత విద్వత్సభ సంక్రాంతి గాన సభల్లో భాగంగా సోమవారం రాత్రి స్థానిక జేఎన్‌టీయూకే అల్యూమినియం ఆడిటోరియంలో నిర్వహించిన మహాదాసు శ్యామ నీలాద్రిరావు ఫ్యూషన్ సంగీత కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. శాస్త్రీయ సంగీతంతోపాటు భక్తి సంగీతం ఎలా కంపోజ్ చేస్తారనే విషయాలను తెలిపారు. అనేక మంది వాగ్గేయకారుల కీర్తనలు, భక్తిగీతాలు, సినీ గీతాలు వాయించి అందరినీ మైమపించారు. వీరికి మృదంగంపై మహాదాసు ఏడుకొండలు, కీబోర్డుపై సీహెచ్ ప్రవీణ్, రిథమ్ పేడ్స్‌పై జి.బాబూరావు చక్కటి సహకారాన్ని అందించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని జేఎన్‌టీయూకే వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ జి.దీక్షితులు ప్రారంభించారు. అనంతరం వీసీ మురళీకృష్ణ మహాదాసు శ్యామ నీలాద్రిరావును సత్కరించారు. ఎంవీజీ కృష్ణంరాజు, నల్లమిల్లి మణిబాబు, అనంత్, వక్కలంక రామకృష్ణ, గట్టి శ్రీకృష్ణదేవరాయలు, చావలి సూర్యకుమారి పాల్గొన్నారు.